ఎకరాకు 25 వేలు ఇవ్వాలి

ముప్పును ముందే హెచ్చరించినా కాంగ్రెస్ సర్కారు తలకెక్కలేదు • కల్పతరువు లాంటి కాళేశ్వరంపై కక్షగట్టొద్దని మొత్తుకున్నా వినలే

ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ • ఎండిన పంటలకు సీఎందే బాధ్యత • బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ముంచుకొస్తున్న ముప్పు గురించి ముందే హెచ్చరించినా.. కాంగ్రెస్ సర్కారు తలకెక్కలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టొద్దని మొత్తుకున్నా.. విషం తప్ప విషయం లేని ముఖ్యమంత్రి వినిపించుకోలేదని మండిపడ్డారు. కండ్ల ముందే పచ్చని పంటలు ఎండుతున్నాయని వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రాథమిక నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు అని విమర్శించారు. ఓవైపు రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం రాక అన్నదాత అల్లాడుతున్న సమయంలో గోరుచుట్టుపై రోకలిపోటులా పంటలు ఎండటంతో అన్నదాతల బతుకు ఆగమైందని ఆవేదన వ్యక్తంచేశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ కక్షగట్టి తెచ్చిన కరువు కాబట్టి రైతులను ఆదుకునే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదేనని స్పష్టంచేశారు. ఎండిన ప్రతి ఎకరానికి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో వెంటనే రూ.25 వేల నష్ట పరిహారం ప్రకటించాలని మంగళవారం ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు. ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తే రైతులతో కలిసి కాంగ్రెస్ సర్కారు భరతం పడతామని హెచ్చరించారు.

హైడ్రా పేరుతో వసూళ్ల దందా

హైడ్రా పేరుతో వసూళ్ల దందాకు తెరలేపి మూసీ పేరుతో పేదల ఇండ్లపై సర్కారు పగబట్టిందని కేటీఆర్ విమర్శించారు. ఫార్మా సిటీ పేరుతో భూములు చెరబడుతూ, ఫోర్త్ సిటీ పేరుతో సీఎం కుటుంబం రియల్ వ్యాపారం చేస్తున్నదని మండిపడ్డారు. ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూములను ఆక్రమిస్తూ, పేదలపై ప్రతాపం చూపి పెద్దలతో ఒప్పందం చేసుకుంటున్నారని విమర్శించారు. నాడు మద్యం వద్దనోళ్లే నేడు మద్యం ముద్దంటున్నారని, ధరల సవరణ పేరుతో కొత్త బ్రాండ్లతో అక్రమ ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆక్షేపించారు. ఆరు గ్యారెంటీలను గాలికి వదిలేసి ప్రశ్నించిన వారిని జైలుకు పంపుతున్నారని మండిపడ్డారు. 'రైతుభరోసా రాదు. రుణమాఫీ కాదు. పంటలు కొనుగోలు చేయరు. ధాన్యానికి బోనస్ బోగస్. తులం బంగారం ఇయ్యరు. ఉద్యోగాలు వేయరు. ఉద్యోగులకు పీఆర్సీ రాదు. డీఏలు ఇవ్వరు. సత్యం వధ ధర్మం చెర. పదేండ్లే కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను 15 నెలల కాంగ్రెస్ పాలనలో అథః పాతాళానికి తీసుకెళ్లారు. ఆర్థికశక్తిగా ఎదిగిన తెలంగాణను ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారు. ఇది పాలన కాదు పీడన. ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ. జాగో తెలంగాణ జాగో' అని హెచ్చరించారు.

కేసీఆర్ దార్శనికతకు ఇదీ నిదర్శనం

తెలంగాణలో తయారైన ఎయిర్ పాడ్స్ ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి కావడం దేశానికి గర్వకారమని కేటీఆర్ తెలిపారు. నాడు కేసీఆర్ ప్రభుత్వ కార్యకలాపాలు, సులభతర విధానాల కారణంగా ఫాక్స్‌కాన్ కంపెనీ హైదరాబాద్‌ను ఎంపిక చేసుకున్నదని గుర్తుచేశారు. వచ్చేనెలలో ఆ కంపెనీ కార్యకలాపాలు ప్రారంభం కాబోతున్నాయని తెలిపారు. మన రాష్ట్రంలో తయారైన ఎయిర్ ప్యాడ్స్ విదేశాలకు ఎగుమతవుతాయని పేర్కొన్నారు. ఇదంతా కేసీఆర్ నాయకత్వ పటిమ, ముందుచూపునకు నిదర్శమని తెలిపారు.

• భగీరథ నీటిలో పురుగులు

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం బోర్లం క్యాంపులో మంగళవారం సరఫరా చేసిన మిషన్ భగీరథ నీటిలో పురుగులు ప్రత్యక్షమయ్యాయి. కొద్ది రోజులుగా రంగుమారిన నీళ్లు వస్తుండగా, తాజాగా పురుగులు కూడా కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. – బాన్సువాడ రూరల్

మంత్రుల హడావుడి.. మోటర్ల పీటముడి

మొదటిపేజీ తరువాయి...

ప్రాంతంలో రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కేసీఆర్ ప్రభుత్వం హనుమకొండ జిల్లా దేవన్నపేట వద్ద నిర్మించిన పంపింగ్ వ్యవస్థను బుధవారం ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సాగునీటి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చి దేవన్నపేట పంప్‌హౌజ్ వద్ద పూజలు చేశారు. మోటర్‌ను ఆన్ చేసేందుకు ప్రయత్నించగా స్టార్ట్ కాలేదు. దీంతో సాగునీటి శాఖ ఉన్నతాధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడి నుంచి వరంగల్ నగరంలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) గెస్ట్ హౌజ్‌కు చేరుకున్నారు. మోటర్లు ఆన్ అయిన తర్వాతే హైదరాబాద్‌కు వెళ్తామని విలేకరుల సమావేశంలో ప్రకటించామని, ఎంత రాత్రి అయినా ఆన్ అయ్యేలా చూడాలని అధికారులను బుజ్జగించారు. ఈ నెల 20 తర్వాతే పంపింగ్ చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పినా పట్టించుకోకుండా హడావుడి చేస్తే తాము ఏమీ చేయలేమని అధికారులు పేర్కొన్నారు.

నిపుణులు లేరు..

ప్రాజెక్టులో మూడో దశ కింద రామప్ప చెరువు నుంచి ఉనికిచర్ల వరకు రూ.1494 కోట్లతో టన్నెల్, దేవన్నపేట పంప్‌హౌజ్ పనులను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిచేసింది. గోదావరి నుంచి దేవాదుల పంప్‌హౌజ్‌ల ద్వారా భూపాలపల్లి జిల్లాలోని భీంఘన్‌పూర్ రిజర్వాయర్‌కు అక్కడి నుంచి రామప్ప చెరువుకు చేరిన నీటిని వరంగల్ శివారులోని ఉనికిచర్ల వరకు 43.06 కిలోమీటర్ల టన్నెల్‌లో నీరు ప్రవహిస్తుంది. టన్నెల్‌లో ఉనికిచర్ల వరకు వచ్చిన నీటిని 6.86 మీటర్ల దూరంలోని ధర్మసాగర్ రిజర్వాయర్‌కు దేవన్నపేట వద్ద ఏర్పాటు చేసిన పంపులతో తరలించేలా పనులు పూర్తయ్యాయి. దేవన్నపేట పంప్‌హౌజ్ నిర్వహణకు అవరసరమైన కరెంటు, సాంకేతికతను ఏర్పాటు చేశారు. దేవన్నపేట పంప్ హౌజ్ పనులను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పూర్తి చేసింది. ఆస్ట్రియా నుంచి భారీ సామర్థ్యం ఉన్న మోటర్లను తెచ్చి అమర్చారు. సాంకేతిక నిపుణులు ఆస్ట్రియా నుంచి రావాల్సి ఉన్నది. పేరు కోసం మంత్రులు వచ్చి మాన్యువల్ పద్ధతిలో ఆన్ చేయడం వల్ల పంపింగ్ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉందని సాగునీటి శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

కేసీఆర్ హయాంలో నిర్మాణం..

సాగునీరు అందించే దేవాదుల ప్రాజెక్టు పనులను పూర్తి చేసే విషయంలో ఉమ్మడి రాష్ట్రంలోని ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించాయి. దేవాదుల ప్రాజెక్టుతో వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, జనగామ, సిద్ధిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని 5.57 లక్షల ఎకరాలకు రెండు పంటలకు సాగునీరు అందించేలా కేసీఆర్ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను పూర్తిచేసింది. దేవాదుల ప్రాజెక్టు మూడు దశలలో ఉన్నది. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం గంగారం వద్ద గోదావరి నదిలోని దేవాదుల ప్రాజెక్టు పంప్‌హౌజ్ నుంచి మూడు మార్గాల్లో హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్‌కు నీరు పంపింగ్ జరిగేలా ఈ ప్రాజెక్టును డిజైన్ చేశారు. ఒకటో దశలో 5.18 టీఎంసీలు, రెండో దశలో 7.25 టీఎంసీలు.. మూడో దశలో 25.75 టీఎంసీల నీటిని ఏడాది పొడవునా పంపింగ్ చేసేలా ప్రాజెక్టును మార్చింది. గోదావరి నుంచి ఏడాది పొడవునా 60 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యంతో ఈ నిర్మాణాలు జరిగాయి. దేవన్నపేట పంప్‌హౌజ్‌తో వారంలోనే ధర్మసాగర్ రిజర్వాయర్ నిండనున్నది. ధర్మసాగర్ నుంచి జనగామ, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జనగామ, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోని ఆయకట్టుకు నీరు అందుతుంది.

పంప్‌హౌజ్ వద్ద రచ్చ...

దేవన్నపేట పంప్‌హౌజ్ ప్రారంభోత్సవం పేరిట జరిగిన కార్యక్రమం ఆగమాగమైంది. సాగునీటి శాఖ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో స్థానిక ఎమ్మెల్యేలు నాగరాజు, కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య ఫొటోలను పెట్టలేదు. మంత్రులు అక్కడికి వచ్చే ముందు కాంగ్రెస్ కార్యకర్తలు గుర్తించి చెప్పడంతో అధికారులు హడావుడిగా దాన్ని తొలగించే ప్రయత్నం చేశారు. వేరే ఫ్లెక్సీలలో ఉన్న ఫొటోలను కత్తిరించి ఇక్కడి ఫ్లెక్సీలో అంటించే ప్రయత్నం చేశారు. ఫ్లెక్సీ రగడతో ప్రెస్‌మీట్‌ను వేరేచోటికి మార్చారు. అక్కడ సాగునీటి శాఖ అధికారులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మినిట్స్ వివరాలు లేవని, వ్యవహార శైలి బాగాలేదని, దేవాదుల పంపింగ్ నిర్వహణలోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

హనుమకొండ జిల్లా సుబేదారి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ నాయకులు

నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లిలో పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ నాయకులు

బీఆర్ఎస్వీ అసెంబ్లీ ముట్టడి భగ్నం

విద్యారంగ సమస్యలపై భగ్గుమన్న విద్యార్థులు

ఎక్కడికక్కడ నాయకుల ముందస్తు అరెస్టులు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, మార్చి 18 : విద్యారంగ సమస్యలతోపాటు ఉస్మానియా యూనివర్సిటీలో నిరసనలు, ర్యాలీలు, ఉద్యమాలను నిషేధిస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వీసీ చర్యలు తీసుకోవడంతో విద్యార్థిలోకం భగ్గుమన్నది. ఈ మేరకు బీఆర్ఎస్వీ రాష్ట్ర కమిటీ చలో అసెంబ్లీకి మంగళవారం పిలుపునివ్వగా ఎక్కడికక్కడ పోలీసులు కట్టడి చేశారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల నుంచి పలువురు నాయకులు, విద్యార్థులు అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేసి ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని దేవరకొండ, మిర్యాలగూడ, సంస్థాన్ నారాయణపురం, చండూరు, త్రిపురారం, నకిరేకల్, నార్కట్‌పల్లి, పాలకవీడు, నేరేడుచర్ల, పెన్‌పహాడ్, మోత్కూరు, ఆత్మకూర్.ఎం మోటకొండూరు, బీబీనగర్, భూదాన్ పోచంపల్లి మండలాల్లో బీఆర్ఎస్వీ నాయకులను అరెస్ట్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని పలుచోట్ల నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న బీఆర్ఎస్వీ నాయకులను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఓయూలో ఆంక్షలు ఎత్తివేయాలి

- విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి
- సీఎంకు మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి లేఖ

హైదరాబాద్, మార్చి 18 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా యూనివర్సిటీలో ఆంక్షలు విధిస్తూ జారీచేసిన సర్క్యూలర్‌ను వెంటనే నిలిపివేయాలని ఓయూ ఆర్ట్స్ కళాశాల విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు, మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి మంగళవారం బహిరంగలేఖ రాశారు. తమ సమస్యల పరిష్కరించడానికి విద్యార్థులు ప్రజాస్వామిక పద్ధతిలో నిరసనలు, ధర్నాలు చేయడం సహజమని పేర్కొన్నారు. ఓయూ, కేయూతోపాటు రాష్ట్రంలోని అన్ని అనుబంధ డిగ్రీ కళాశాలలో విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తే ఇలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, ఆందోళనలు ఉండవని, వెంటనే విద్యార్థి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు.

• ఇదేనా ఇందిరమ్మ రాజ్యం ?

పేదల ఇండ్లకు కరెంట్ కట్ చేయడమే ఇందిరమ్మ రాజ్యమా.. అని డబుల్ బెడ్రూం లబ్ధిదారులు ప్రశ్నించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం దద్దేపల్లిలో ఏడాదిన్నర నుంచి లబ్ధిదారులు డబుల్ బెడ్రూం ఇండ్లలో జీవనం గడుపుతున్నారు. గత ప్రభుత్వం వారికి విద్యుత్తు మీటర్లు అమర్చి కరెంట్ సరఫరా చేసింది. ప్రస్తుత ప్రభుత్వంలో మంగళవారం అధికారులు కాలనీకి కరెంట్ కట్ చేశారు. కాలనీలో ముగ్గురు రూ.8వేలు, 9వేలు, 10వేల బిల్లులు బకాయి ఉండగా, మిగతా 37మంది రూ.వందల్లో మాత్రమే బకాయి ఉన్నారు. కొందరు బిల్లులు చెల్లించినా కరెంట్ కట్ చేశారు. గత పదేండ్ల పాలనలో అధికారులు ఇంత దురుసుగా ప్రవర్తించలేదని బాధితులు వాపోయారు. కరెంట్ కట్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే యశస్వినీరెడ్డిని కోరారు. – పాలకుర్తి

• ఇసుక తరలించనీయం

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం ఏటిధర్‌పల్లివాసులు గ్రామ వాగు నుంచి ఇసుక తరలించనీయమని మూకుమ్మడిగా తీర్మానించారు. ఈ కాపీని అధికారులకు అందజేశారు. ఇసుక కొరతతో ప్రభుత్వం ఇటీవల గ్రామ శివారులోని దుందుభీ నదిలో రీచ్‌ను ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు మంగళవారం సమావేశమయ్యారు. రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు హాజరై ఇసుక రీచ్ ఏర్పాటుకు సహకరించాలని గ్రామస్తులను కోరారు. దీంతో రీచ్ పెట్టాలని చూస్తే ఆత్మహత్య చేసుకుంటామని పలువురు పురుగుల మందు డబ్బాలతో అధికారుల ముందుకు వచ్చారు. దీంతో చేసేది లేక అధికారులు వెనుదిరగగా సమస్య సద్దుమణిగింది. – తాడూరు

• కేయూ వీసీని సస్పెండ్ చేయాలని ధర్నా

విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నాయకులు రామకృష్ణ, జార్జిరెడ్డి, సురేశ్, మస్తాన్ మాట్లాడుతూ కళాశాలలు బకాయిలు చెల్లించలేదనే సాకుతో డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ ఫలితాలు నిలిపివేడంతో విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. – ఖమ్మం అర్బన్

ఆదిలాబాద్ జిల్లా సుంగపూర్‌లోని అటవీ సమీపంలో ఉన్న చేతిపంపు వద్ద తాగునీటి కోసం క్యూకట్టిన ఆదివాసీలు

మంచినీటి కోసం ఆదివాసీల ఆగమాగం

ఆదిలాబాద్ జిల్లాలో కిలోమీటర్ల మేర నడక.. ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో విన్నవించినా ఫలితం శూన్యం

నార్నూర్, మార్చి 18 : భగ్గుమంటున్న ఎండలకు భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. గుక్కెడు నీటి కోసం కిలోమీటర్లు నడవాల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం సుంగపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండాలు, గూడేల వాసులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. ఈ గ్రామంలో 270 కుటుంబాలు ఉండగా.. 1500 వరకు జనాభా ఉంది. కొలాంగూడలో ఒక చేతిపంపు, గోండుగూడలోని అటవీ ప్రాంతంలో ఒక చేతిపంపు ఉండగా.. వీటి ద్వారా బొట్టుబొట్టు నీళ్లు వస్తున్నాయి. రెండు చేతిపంపుల వద్ద రాత్రీపగలు తేడా లేకుండా నీటికోసం నిరీక్షించాల్సి వస్తున్నదని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన ప్రజావాణిలో సమస్యను విన్నవించినా ఫలితం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

• ఇందూరులో అంగన్‌వాడీలపై పోలీసు జులుం

నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలపై జులుం ప్రదర్శిస్తున్న మహిళా పోలీసులు

నిజామాబాద్/నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, మార్చి 18: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు మంగళవారం నిజామాబాద్‌లో చేపట్టిన కలెక్టరేట్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఉద్యోగినిలపై పోలీసులు జులుం ప్రదర్శించడంతో పలువురికి గాయాలయ్యాయి. ఒక్కొక్కరిని ఐదారుగురు మహిళా పోలీసులు చుట్టుముట్టి బలప్రదర్శన చేశారు. కాళ్లు, చేతులు పట్టుకుని పశువుల మాదిరిగా లాక్కెళ్లి పోలీసు వాహనాల్లోకి విసిరేశారు. ఈ క్రమంలో పలువురికి గాయాలయ్యాయి. కాగా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 48 గంటల ధర్నా మంగళవారం ముగిసింది.

పొట్టి శ్రీరాములు పేరును కొనసాగించాలి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పేరును యథాతథంగా ఉంచాలని కోరుతూ ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం, ఖమ్మం నగర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించి ఆర్యవైశ్యుల సత్తా చూపిస్తామని హెచ్చరించారు. ఆర్యవైశ్యులకు పలు రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. – ఖమ్మం

సోమవారం రాత్రి ఇంటి పన్ను వసూలు చేస్తున్న అధికారులు

పన్ను వసూళ్ల పేరిట రాత్రిపూట ఇండ్లపైకి

మున్సిపాలిటీ అధికారుల అత్యుత్సాహం • ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పట్టణ ప్రజలు

చెన్నూర్, మార్చి 18 : మంచిర్యాల జిల్లా చెన్నూర్ మున్సిపాలిటీ అధికారులు పన్నుల వసూళ్ల పేరిట అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. పగలూ.. రాత్రీ అనే తేడా లేకుండా ఇండ్లపైకి వెళ్లి ప్రజలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. మార్చి నెలాఖరుకల్లా వందశాతం పన్నులు వసూలు చేసే లక్ష్యంతో అధికారులు వాడ వాడలా తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. సోమవారం రాత్రి పట్టణంలోని విశ్వకర్మ వాడకు చెందిన ఓ వ్యక్తి ఇంటికి మున్సిపాలిటీ అధికారులు వెళ్లారు. అతను రోజూ వారి కూలీ కావడంతో ప్రస్తుతం పన్ను చెల్లించే స్థితిలో లేనని అధికారులకు వివరించారు. అయితే, అధికారులు ఏమాత్రం జాలి చూపించకుండా పన్ను చెల్లించాల్సిందేనంటూ జులుం ప్రదర్శించారు. ఇంటికి తాళం వేస్తాం.. సామాన్లు తీసి బయట పెడతాం...అంటూ బెదిరించారు. దీంతో చేసేదేమి లేక చుట్టుపక్కల వారి వద్ద నుంచి అప్పు చేసి పన్నులో కొంత మొత్తాన్ని చెల్లించాడు. అంతటితో ఆగని అధికారులు మార్చి నెలాఖరుకల్లా పన్ను మొత్తం చెల్లించాలని, లేదంటే పెద్ద సార్లు వస్తే ఇంకా ఇబ్బంది పడాల్సివస్తుంని బెదిరించారు. మున్సిపాలిటీ అధికారుల తీరుపట్ల ప్రజలు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. పన్నుల పేరిట ఇలా మొండిగా వ్యవహరించడం సరికాదని మండిపడుతున్నారు. ఈ విషయమై మున్సిపాలిటీ కమిషనర్ మురళీకృష్ణను వివరణ కోరేందుకు యత్నించగా అందుబాటులో లేరు.

రత్నాపూర్‌లో రోడ్డుపై బైఠాయించిన రైతులతో మాట్లాడుతున్న అధికారులు, పోలీసులు

మమ్మల్ని చంపినా భూములియ్యం

- ఇండస్ట్రియల్ పార్కు వద్దే వద్దు
- రత్నాపూర్‌లో రైతుల ఆందోళన
- స్థల పరిశీలన కోసం వచ్చిన అధికారుల అడ్డగింత
- నాలుగు గంటల పాటు ధర్నా.. స్వల్ప ఉద్రిక్తత

రామగిరి, మార్చి 18: 'వ్యవసాయం చేసుకొని బతికే తమ పొట్టకొట్టవద్దని, ఇండస్ట్రియల్ పార్కు ఇక్కడ వద్దే వద్దని, మమ్ముల చంపినా భూములు ఇచ్చేదిలేదని' పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రత్నాపూర్ రైతులు తేల్చిచెప్పారు. మంగళవారం రత్నాపూర్ శివారు మేడిపల్లిలో స్థల పరిశీలన కోసం అధికారులు వస్తున్నట్టు సమాచారం మేరకు రైతులందరూ గ్రామ ప్రధాన కూడలికి వెళ్లి బైఠాయించారు. మంథని ఆర్డీవో సురేష్, ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ మహేశ్వర్‌రావు, తహసీల్దార్ సుమన్, పోలీసులను అడ్డుకున్నారు. మంథని సీఐ రాజు, ఎస్ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వారించినా, రైతులు ససేమిరా అన్నారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్ రైతులను చెదరగొట్టేందుకు యత్నించగా స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. నాలుగు గంటల పాటు బైఠాయించి, అధికారులను అడుగు ముందుకు వేయనీయకుండా అడ్డుకున్నారు. దీంతో చేసేదేమిలేక వారు వెనుదిరిగారు.